క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

మైలవరం: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మైలవరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. శైలజ పేర్కొన్నారు. మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు, సమస్యలు, శిక్షలను వివరించారు.

కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా మౌస్మి గనియా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా మౌస్మి గనియా నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ సంపత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గం ఆమెకు అభినందనలు తెలిపారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

నూజివీడు: పట్టణంలోని పలుచోట్ల వరద ముంపు ప్రాంతాలను నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న పరిశీలించారు. తుక్కులూరు వద్ద రామిలేరు వాగు చప్టాపై నీరు ప్రవహిస్తుండటంతో అక్కడకు వెళ్లి పరిశీలించారు. వరద ప్రవాహం తగ్గే వరకు రాకపోకలకు అనుమతించొద్దని స్థానిక సచివాలయ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని మొఘల్ చెరువు వద్ద రోడ్డుపైకి చేరిన వరద నీటిని పరిశీలించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన వరదనీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

నూజివీడు: బాల్యంలో వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలు ఆరోగ్యపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటారని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష అన్నారు. స్థానిక రామాయమ్మరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మండల న్యాయసేవాధికార సంస్థ, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాలు- దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గర్భవతి కావడం వల్ల రక్తహీనతకు గురికావడం, పుట్టే బిడ్డ కూడా అనారోగ్యం బారిన పడే ప్రమాదముందన్నారు. న్యాయవాదులు నండూరి పద్మాంజలి, ఎస్‌కేడీ ప్రసాద్, సూపర్‌వైజర్ కె. ధనలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చాట్రాయి: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన కృష్ణారావుపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తోట వెంకట నాగేశుకు చెందిన పాడి గేదె గురువారం తోటలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సుమారు రూ. 80 వేల నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. దీనిపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సాంకేతికతతో సాగు సులభం

ముసునూరు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేస్తోందని మండల వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. మండలంలోని చింతలవల్లి రైతు సేవా కేంద్రం వద్ద ఆర్‌కేవీవై పథకం 2024-25 ద్వారా స్కంద ఎంటర్‌ప్రైజెస్ రైతు గ్రూపునకు మంజూరైన డ్రోన్ పరికరాన్ని రైతులకు గురువారం అందజేశారు. సాంకేతిక పరికరాల ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఎరువులు, పురుగు మందుల వినియోగం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పొలడుగు నాగంబాబు, రఘుబాబు వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం దాడి చేశారు. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,04,600 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరాలపై పోలీసులు దాడి

తిరువూరు: తిరువూరులో రెండు చోట్ల నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై బుధవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. రాజుపేట బస్టాండ్ వెనుక ఒక ఇంటిలో పెద్దఎత్తున జూదాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి నిర్వహించగా రూ.30 వేలు నగదు, 10మంది జూదరులు పట్టుబడ్డారు. పాత తిరువూరులో మరో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు జూదగాళ్లను, రూ. 3 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ అమర వీరులకు నివాళి

ఇబ్రహీంపట్నం: బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్ల రద్దు, విద్యుత్ భారాల తగ్గింపు కోసం ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో సీపీఎం నాయకులు గురువారం నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు విధానాన్ని విరమించాలని డిమాండ్ చేశారు.

● నూజివీడు: బషీర్‌బాగ్ అమరవీరుల చిత్రపటాలకు వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకటరామారావు, సీపీఎం జిల్లా నాయకులు జి. రాజు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీలను, స్మార్ట్‌మీటర్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాగుల ఉగ్రరూపం

● లోతట్టు ప్రాంతాలు జలమయం
● పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
● అధికారులు పర్యటించి జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు




చిలుకూరు వద్ద ఏనుగు గడ్డ వాగు పొంగడంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు ; హెచ్.ముత్యాలంపాడు వద్ద చప్టా మీదుగా ప్రవహిస్తున్న బుడమేరు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలో బుధ భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రానికి వర్షం తగ్గింది. వాగులు పొంగడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెడ్డిగూడెం మండల పరిధిలోని కళంగివాగు పొంగిపొర్లడంతో నరుకుళ్లపాడు, ఓబులాపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దార్ సుశీలాదేవి పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులు, అధికారులకు పలు సూచనలు చేశారు. రెడ్డిగూడెంలోని కోవ వాగు పొంగడంతో లోతట్టు పొలాల్లో సాగవుతున్న వంద ఎకరాల వరకు వరిపైరు నీట మునిగింది. జి.కొండూరు మండల పరిధిలోని పులివాగు, దొర్లింతాల వాగు, కప్పలవాగు పొంగిపొర్లాయి. కప్పలవాగు వరద ఉధృతికి పినపాక, జి.కొండూరు గ్రామాల మధ్య బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ నీరు చేరి ప్రజలు నరకయాతన పడ్డారు. వర్షం గురువారం సాయంత్రానికి తెరపివ్వడంతో వరద ఉధృతి తగ్గిపోయి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

బుడమేరులో 3 వేల క్యూసెక్కులు..

బుడమేరులో వరద ప్రవాహం బుధవారం సాధారణంగానే ఉంది. ఎగువ ప్రాంతాలైన ఎ.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం మండలాల పరిధిలో బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో గురువారం ఉదయానికి వరద ప్రవాహం పెరిగింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద గురువారం సాయంత్రానికి నీటి నిల్వ 3.8 అడుగుల మేర నిర్దిష్టంగా ఉంది. ఎగువ నుంచి పలు వాగుల ద్వారా వస్తున్న వరద ప్రవాహంతో బుడమేరు డైవర్షన్ కెనాల్ ద్వారా 3 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం కృష్ణానదిలో కలుస్తోంది. బుడమేరుకు వరద ప్రవాహం పెరగడంతో హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

మైలవరం: మైలవరం, వెల్వడం మధ్య ఉన్న కొండవాగు పొంగి ప్రవహిస్తోంది. మైలవరంలోని కొండవాగు పొంగి ప్రవహిస్తుండటంతో దళితవాడ, చిన హరిజనవాడ వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షానికి పంట పొలాల్లో నీరు నిలిచింది.

పొంగిన ఏనుగుగడ్డ, ఉబ్బిడి వాగు..

ఇబ్రహీంపట్నం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న అధిక వర్షాలకు ఏనుగు గడ్డ, ఉబ్బిడి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నీటి ప్రవాహంతో అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. చిలుకూరు వద్ద ఏనుగుగడ్డ వాగు ఉధృతంగా పొంగటంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. నీటి ప్రభావంతో చిలుకూరు, దాములూరు, కొత్తపేట, ఆత్కూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పరిసర గ్రామాల్లో పత్తి, మెట్ట వరి, మినుము పంటలు ముంపునకు గురయ్యాయి. ఇబ్రహీంపట్నం, జూపూడి, కిలేశపురం గ్రామాల్లో సైతం ఇటీవల కాలంలో వచ్చిన వరదలు, వర్షాలకు వరి పంటలు నీటి ఎద్దడికి గురికాగా, ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. మరలా ఇప్పుడు ముంపునకు గురయ్యాయి. ఇక పంటలు కోలుకునే పరిస్థితులు ఉండవని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కిలేశపురం, మూలపాడు వద్ద ఉబ్బిడి వాగులు పొంగడంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆగస్టు 13 నుంచి కృష్ణానదికి వరద నీరు ప్రవహించడంతో చినలంక పెదలంక గ్రామాలకు 15 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి.

● విస్సన్నపేట: స్థానిక ఎన్టీఆర్ కాలనీ, ఇందిరా నగర్‌లోని పల్లపు ప్రాంతాల్లో వర్షంనీరు నిలిచింది. డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో రహదారులపై వర్షం నీరు ప్రవహించింది. గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

తాతకుంట్ల గ్రామ పంచాయతీ గౌరంపాలెంలో కర్రల పందిళ్లు ఏర్పాటు చేసి కూరగాయలు సాగు చేస్తున్న రైతులవి సుమారు 10 ఎకరాల్లో పందిళ్లు పడిపోగా ఉద్యాన అధికారి నరేంద్రకుమార్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

● ఆగిరిపల్లి: మండలంలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎగువన కురిసిన వర్షాలతో కుంపిని వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆగిరిపల్లి, నూగుండపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగు ఉధృతిని తహసీల్దార్ ప్రసాద్, ఎస్‌ఐ శుభశేఖర్ పరిశీలించి వంతెనపై పోలీస్ గస్తీని ఏర్పాటు చేశారు.

● తిరువూరు: నియోజకవర్గంలో అధిక వర్షాలకు పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరు, తిరువూరు మండలంలో చింతలపాడు వద్ద గుర్రపు వాగు, చౌటపల్లి వద్ద వెదుళ్లవాగు, అక్కపాలెం వద్ద పడమటివాగు, గంపలగూడెం మండలం లింగాల వద్ద గుర్రపువాగు, మునుకుళ్ల వద్ద అలుగు వాగులకు వరదరావటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ, పోలీస్ అధికారులు వరద తీవ్రతను పరిశీలించి వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. తిరువూరు తహసీల్దార్ ఉదయభాస్కర్, గ్రామీణ రహదారుల్లో వాగుల వద్ద సిబ్బందితో కాపలా ఏర్పాట్లు చేశారు.

● ముసునూరు: మండలంలో సగభాగానికిపైగా వ్యాపించి ఉన్న సంధ్యపు వాగు, పలుచోట్ల ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వలసపల్లి-ముసునూరు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. చెక్కపల్లి, చింతలవల్లి, కాట్రేనిపాడు, వలసపల్లి, ముసునూరు, రమణక్కపేట, సూరేపల్లి గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు నివాసాల్లోకి వర్షం నీరు చేరింది. సంధ్యపు వాగు పలు గ్రామాల్లోని పంట చేలను ముంచెత్తింది.



పినపాక గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలవాగు



భీమవరప్పాడు గ్రామంలో ఇంట్లోకి చేరిన వర్షంనీరు



తిరువూరు మండలం చౌటపల్లి వద్ద వెదుళ్లవాగు వద్ద ఇలా..

వరద ప్రాంతాల్లో ఆర్డీఓ చైతన్య పర్యటన



ఇబ్రహీంపట్నం: మండలంలో పొంగుతున్న వాగులు, వంకలు, కృష్ణానది వరద ప్రవాహాన్ని ఆర్డీఓ కావూరి చైతన్య గురువారం పరిశీలించారు. చిలుకూరు గ్రామం వద్ద పొంగుతున్న ఏనుగు గడ్డ వాగును పరిశీలించి చినలంక, పెదలంక గ్రామాలకు రాకపోకలు స్తంభించిన పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఫెర్రీ వద్ద కృష్ణానది వరద పరిస్థితి పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున వినాయక నిమజ్జనాలు ఈ ప్రాంతంలో చేయవద్దని ఆదేశించారు. విజయవాడ ఘాట్లలో చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు డివిజన్‌లో భారీ వర్షపాతం నమోదు

నూజివీడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నూజివీడు డివిజన్‌లో బుధవారం భారీ వర్షం కురిసింది. 351.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సగటు వర్షపాతం 58.6 మి.మీ నమోదైంది. ఆగిరిపల్లి మండలంలో 36.8 మి.మీ, చాట్రాయి మండలంలో 32.4 మి.మీ, చింతలపూడి మండలంలో 48.2 మి.మీ, లింగపాలెం మండలంలో 73.4 మి.మీ, ముసునూరు మండలంలో 135.4 మి.మీ, నూజివీడు మండలంలో 25.6 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో చెరువుల్లోకి వరదనీరు చేరడంతో పలు చెరువులు నిండాయి.

తిరువూరులో 9.84 మి.మీ వర్షపాతం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో గడిచిన 24 గంటలలో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. తిరువూరులో 9.84 మి.మీ., గంపలగూడెం 8.76 మి.మీ, విస్సన్నపేటలో 8.44 మి.మీ, ఎ.కొండూరులో 8.84 మి.మీ. వర్షపాతం నమోదైంది.

లైవ్‌స్టాక్ ఆఫీసర్ గోపాలకృష్ణకు సన్మానం

తిరువూరు: స్వాతంత్ర్య వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ లైవ్‌స్టాక్ ఆఫీసర్‌గా ప్రశంసాపత్రం అందుకున్న మిరియాల గోపాలకృష్ణను గురువారం తిరువూరులో సన్మానించారు. స్థానిక ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ భవనంలో జరిగిన కార్యక్రమంలో తిరువూరు తాలూకా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

వక్రతుండా.. బహు రూపాయా



తిరువూరు పాత ఏడీబీ సెంటర్‌లో పూజలు



రమణక్కపేటలో గణనాథునికి పూజలు



ఆగిరిపల్లిలోని రజక వీధిలో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు



నూజివీడు పండ్ల మార్కెట్ సెంటర్‌లో గణనాథుడు

నూజివీడు: వినాయక చవితి వేడుకలు నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ప్రజలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పలుచోట్ల పందిళ్లలో గణనాథులు కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రజలు ఇళ్ల వద్ద పూజలు చేసుకున్నారు. ఉండ్రాళ్లు తయారు చేసి లంబోదరుడికి నైవేద్యం పెట్టారు. విద్యార్థులు తమ పుస్తకాలను గణపతి వద్ద పెట్టి పూజలు జరుపుకున్నారు. గణేష్ మండపాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● ముసునూరు: మండల వ్యాప్తంగా 53 వినాయక నవరాత్రి పందిళ్లు ఏర్పాటు చేశారు. రమణక్కపేటలో ఎంపీపీ కొండా దుర్గాభవాని దంపతులు, లోపూడి, గోపవరంలలో వైస్ ఎంపీపీలు కె.రాజా నాయన, పి.గంగాధర్ ప్రత్యేక పూజలు చేశారు. కాట్రేనిపాడు శివారు హరిశ్చంద్రపురం వరసిద్ధి విఘ్నేశ్వర ఆలయం వద్ద 11 అడుగుల గణనాథుని విగ్రహం చేతిలో 13 కిలోల లడ్డూను పెట్టగా, చెక్కపల్లి సెంటర్ సాయి గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో షిర్డీ సాయిబాబా మందిరం గణనాథుని చెంత ఐదు లడ్డూలను పెట్టారు. ఆయా మండపాల వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజాదికాలు నిర్వహిస్తున్నారు.

● ఆగిరిపల్లి: స్థానిక రజకవీధిలో దుర్గా భవానీ యూత్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. వేద శాస్త్ర పాఠశాలలో మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షించింది. వట్టిగుడిపాడు రామాలయం కమిటీ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

● చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన పందిళ్లలో విగ్రహాలను ఉంచి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

● ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుని ఆలయాలు, పలు వీధుల్లో ఏర్పాటు చేసిన చలువ మండిళ్లలో వినాయకుడి విగ్రహాలు ప్రతిష్టించి పూజలు చేశారు. ఇబ్రహీంపట్నంలో, కొండపల్లిలో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వార్డు కౌన్సిలర్లు గణేష్ ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో బీజేపీ నాయకులు పూజలు జరిపారు.

● విస్సన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు జరిగాయి. ఆలయాలు, పందిళ్లల్లో ఏర్పాటు చేసిన ప్రతిమలు పూజలందుకున్నాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● తిరువూరు: తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయాలు, పందిళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరువూరు మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి.

ముంపు నివారణకు శాశ్వత చర్యలు ఏవీ?

మున్సిపల్ అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్లు



సమస్యలపై మాట్లాడుతున్న వైస్ చైర్మన్లు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు

నూజివీడు: భారీ వర్షాలకు పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో ముంపు నివారణ చర్యలను ఎందుకు చేపట్టడం లేదని టీడీపీ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీ, హనుమాన్ జంక్షన్ రోడ్డులో మొఘల్ చెరువు వద్ద రోడ్డు వరదనీటికి మునిగిపోతున్నాయని, కొన్నేళ్లుగా ఈ సమస్య ఉన్నా ఇప్పటి వరకు దానికి శాశ్వత పరిష్కారం చూపలేకపోవడం దారుణమన్నారు. ముంపు నివారణకు ఎస్టిమేషన్లు తయారు చేస్తే మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేయవచ్చని పగడాల సత్యనారాయణ అన్నారు. కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ వరద నివారణకు సంబంధించిన నిధులు రూ.50 లక్షలు ఉన్నాయని, కౌన్సిలర్లు అందరూ సహకరిస్తే ముంపు నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. కౌన్సిలర్ నడకుదురు గిరీష్ మాట్లాడుతూ పారిశుద్ధ్య వర్కర్లకు గత నాలుగేళ్లుగా యూనిఫాం, మెటీరియల్ ఇవ్వడం లేదని, ఇదేనా పారిశుద్ధ్య వర్కర్లపై ఉన్న గౌరవం అని ప్రశ్నించారు. పుష్కార్టులలో డబ్బాలు లేవని, చెత్తను తరలించే ట్రాక్టర్లకు సెల్ఫ్ కాకపోవడంతో చెత్తను ఎత్తుతున్నంతసేపు, కార్మికులు టీ తాగుతున్నా, టిఫిన్ చేస్తున్నా ఇంజిన్ ఆడుతూనే ఉంటున్నాయని, దీనివల్ల డీజిల్ వాడకం పెరిగిపోయి మున్సిపాలిటీకి భారం అవుతోందని పేర్కొన్నారు. ట్రాక్టర్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యన్నారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు

తిరువూరు: తిరువూరులో చెరువు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ 9వ వార్డు కౌన్సిలర్ మూడు దుర్గారావు గురువారం ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోకుని చెరువు ఆక్రమణలు తొలగించాలని కోరారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సబ్ కలెక్టర్ బి.వినూత్న

ఆగిరిపల్లి: మండలంలోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సబ్ కలెక్టర్ బి.వినూత్న సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మండలంలో జరిగే అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ అధికారులు తమ పనితీరు మెరుగుపరుచుకుని మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. భారీ వర్షాలకు పొంగుతున్న వాగులు, చెరువులపై ప్రయాణించకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం



నూజివీడు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోకి చేరిన వర్షం నీరు



రేగడి వాగులో ప్రవహిస్తున్న నీరు

నూజివీడు: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో నూజివీడు పట్టణంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. విజయవాడ రోడ్డులోని ఎన్టీఆర్ కాలనీ, రామాయమ్మరావుపేట, 32వ వార్డులోని పలు పల్లపు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. నూజివీడు-హనుమాన్ జంక్షన్ రోడ్డులో మొఘల్ చెరువు వద్ద వర్షం నీరు రోడ్డుపై నిలిచింది. మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి స్పందించి వర్షం నీటి తరలింపునకు చర్యలు చేపట్టారు.

● చాట్రాయి: మండలంలో కురిసిన వర్షంతో రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. ఉప్పు వాగు, రేగడి వాగులో వరద ప్రవహిస్తోంది. సి.గుడిపాడు మెయిన్ రోడ్డు, చనుబండ మెయిన్ రోడ్డు ఇంకా పలు గ్రామాల్లోని రోడ్లపై వరద నీరు ప్రవహిస్తోంది. తమ్మిలేరు వాగు నుంచి తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు వరద నీరు చేరుతోంది. చిన్నంపేట వద్ద తమ్మిలేరు డైవర్షన్ నుంచి సీకేపాడు చానల్ ద్వారా చిన్నంపేట, కోటపాడు గ్రామాల్లోని చెరువుల్లో వరద నీరు చేరుతోంది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జి.కొండూరు: ఎరువుల దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి హెచ్చరించారు. జి.కొండూరులోని మన గ్రోమోర్ సెంటర్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ఈపాస్, గోడౌన్‌లో ఉన్న ఎరువులను పరిశీలించి మాట్లాడారు. యూరియా, డీఏపీలను రైతులకు అవసరమైన మేరకే విక్రయించాలని సూచించారు. అనంతరం గ్రామ శివారులోని పత్తిపైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ కేసీహెచ్ సూరిబాబు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈలో అధ్యాపక అభివృద్ధి శిక్షణ

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్ అండ్ డీ సెల్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి సెప్టెంబర్ 2 వరకు ఎమర్జింగ్ టెక్నాలజీలో పరిశోధన అనే అంశంపై వారం రోజులు అధ్యపక అభివృద్ధి శిక్షణా కార్యక్రమం జరుగుతుందని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి తెలిపారు. శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. బెంగళూరు డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ శాస్త్రవేత్త, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. రామ్‌ప్రభు శిక్షణ ఇచ్చారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తిరువూరు: తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు నల్లగుండ్ల రామకృష్ణారెడ్డిని హైస్కూల్ ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంఈఓ శ్యామ్ సుందరరావు, ఎస్ఎంసీ చైర్మన్ వెంపాటి అబ్రహాం, వైస్ చైర్‌పర్సన్ పగిడాల సీత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **గోపాల్ మాస్టారుకు ప్రజా సేవారత్న అవార్డు**

మైలవరం: వెల్వడం గ్రామానికి చెందిన పాఠశాల ఉపాధ్యాయుడు పల్లపోతుల గోపాల్ మాస్టార్‌కు ప్రజా సేవారత్న అవార్డు లభించింది. విద్యారంగానికి గోపాల్ మాస్టర్ చేసిన సేవలను గుర్తించిన సత్తెనపల్లి ఆశ్రేయ చారిటబుల్ ట్రస్టు ప్రజా సేవా రత్న అవార్డును ప్రకటించిందని సంస్థ నిర్వాహకులు డి.పరంధామయ్య వివరించారు.

సారా విక్రేత పట్టివేత

ముసునూరు: సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్‌సింగ్ గురువారం తెలిపారు. నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య ఆధ్వర్యంలో చెక్కపల్లిలో చిట్టిబొమ్మ అంకరాజు ఇంటివద్ద సోదా చేసి ఒక లీటరు సారా స్వాధీనం చేసుకున్నారు. అతనికి సారా సరఫరా చేస్తున్న నూజివీడు మండలం దిగవల్లికి చెందిన మిద్దె నరేంద్రబాబుపై కేసు నమోదు చేశామన్నారు.